# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నదుల అనుసంధానం ద్వారా నీటి సమస్యలు తగ్గుతాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **ప్రజలకు ప్రభుత్వ పాలనను అందించడంలో అధికారులే వారధులని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**

3. **సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని ప్రభుత్వానికి సహకారాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.**

4. **సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.**

==========================

నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. జలవనరుల శాఖకు బడ్జెట్ కేటాయింపులపై శాసనసభలో నిన్న జరిగిన చర్చకు ముఖ్యమంత్రి నిన్నసమాధానం ఇచ్చారు. పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

ప్రజలకు ప్రభుత్వ పాలనను అందించడంలో అధికారులే వారధులని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు హైదరాబాద్ లో నిర్వహించిన శిక్షణా ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొని దిశానిర్దేశం చేశారు. చట్టాలు, నియమాలు అందరికి సహాయం చేయడానికేనని, విధులను ఆపడానికి కాదు అని పేర్కొన్నారు. ముఖ్యమైన సమయాల్లో విచక్షణా జ్ఞానం ముఖ్యం అని దాని ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 29 సెకన్లు

--------------------------

కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు 3 నుంచి 4శాతం రిజర్వేషన్లు కల్పించి వారి సంక్షేమానికి కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో నిర్వహించిన మరుగుజ్జుల సంఘం రజతోత్సవ సమ్మేళనంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, వికలాంగులు అనే పదాన్ని దివ్యాంగులుగా పేరు మార్చి, వాళ్ల ఆత్మగౌరవాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిలబెట్టారని పేర్కొన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించిన నిధులను వారి కోసమే ఖర్చు చేయాలని కోరారు.

--------------------------

సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని ప్రభుత్వానికి సహకారాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.కార్పొరేట్ సామాజిక బాధ్యత -సీఎస్ఆర్‌లో భాగంగా రెండు ప్రైవేటు వైద్య సంస్థలు ప్రభుత్వాసుపత్రుల్లో 1.15 కోట్ల రూపాయలతో 5 అల్ట్రాసౌండ్ స్కానర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆ సంస్థల ప్రతినిధులను అమరావతి సచివాలయంలో నిన్న సన్మానించారు. ఆసుపత్రుల్లో అధునాతన యంత్రాల్ని ప్రభుత్వం సమకూర్చుతోందని, కార్పొరేట్ సంస్థలు కూడా ముందుకొచ్చి సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ స్కానర్లు శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, పలాస, ఇచ్ఛాపురం,లో ఒకటిచొప్పున నరసన్నపేట ఆసుపత్రిలో 2 ఏర్పాటు చేశారని తెలిపారు. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోగనిర్ధారణ సేవలు మెరుగుపడి, మాతా-శిశు ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడతాయని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ-ఎవీ=ణూా చేపట్టే ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. విశాఖ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై VMRDA అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 7 ప్రధాన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ పూర్తి చేయాలని పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం - కాకినాడ పెట్రోలియం కెమికల్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్మెంట్ రీజియన్-VKPCPIR ప్రణాళికలను త్వరగా సిద్ధం చేసి, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం - పీపీపీ విధానంలో చేపట్టే 6 ప్రాజెక్టులకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. చిన్నారులపై లైంగిక నేరాల నివారణే లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ చిన్నారి తల్లి' ప్రత్యేక డ్రైవ్ గోడ పత్రికను గుంటూరు జిల్లా మంగళగిరి డీజీపీ కార్యాలయంలో నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, సున్నితమైన ప్రాంతాల్లో రాత్రి సమయంలో పటిష్టమైన గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీలు, వసతి గృహాల్లో 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో నిర్వహిస్తున్న "సైన్స్ సమగ్ర మహోత్సవ్ 2ఖ 26" ముగింపు కార్యక్రమం ఈరోజు జరుగనుంది. ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని గాంధీనగర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు, ధృవ పత్రాలను అందజేస్తారు. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సైన్స్ ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ మహోత్సవంలో జిల్లాల నుంచి 29,435 మంది విద్యార్థులు, 12,528 జట్లు, 4,118 పాఠశాలలు పాల్గొన్నాయి.

---------------------------

రహదారి ప్రమాదాల్లో మరణాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం రాహత్' పథకం అమలుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్ని రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ఉన్నతాధికారులతో ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం విధానంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి హైదరాబాద్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీ మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా ప్రతి రోడ్డు ప్రమాద బాధితుడికి 1.5 లక్షల వరకు చికిత్స ఉచితంగా అందుతుందన్నారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 'పీఎం రాహత్' పథకం అమలుకు జిల్లాలవారీగా అధికారుల నియామకం, కలెక్టర్లు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవడం వంటి ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసిందని వివరించారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ తరహాలో లెజిస్లేటివ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ ను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని మున్సిపల్ క్రీడా మైదానంలో జరుగుతున్న శాసనసభ్యుల క్రీడా పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, ఇటువంటి క్రీడా పోటీలు ప్రజాప్రతినిధుల మధ్య ఐక్యత, దృఢత్వం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

వాయిస్ 24 సెకన్లు

---------------------------

దక్షిణ అంతర కర్ణాటక నుండి మరాఠ్వాడ మహారాష్ట్ర వరకు ఉన్న ద్రోణి ఉత్తర అంతర కర్ణాటక మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ , యానాంపై దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య, ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

---------------------------

స్వాతంత్ర్య సమర యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ బలిదాన దినం సందర్భంగా ఈరోజు దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ లోని భవరాలో 1906 జులై 23వ తేదీన జన్మించిన చంద్రశేఖర్ యువతను స్వాతంత్ర్య పోరాటం దిశగా కార్యోన్ముఖులను చేసిన వారిలో ఒకరు. 1931 ఫిబ్రవరి 27న అలహాబాద్లో తనను చుట్టుముట్టిన బ్రిటీష్ పోలీసులతో వీరోచితంగా పోరాడి స్వతంత్రుడిగా జన్మించా, స్వతంత్రుడిగా మరణిస్తానంటూ తనని తాను కాల్చుకుని దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న మహనీయుడు చంద్రశేఖర్ ఆజాద్.